క్లుప్తంగా

కరాటేలో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ఎస్సై ఉపేందర్

శ్రీరాంపూర్: ఇటీవల మందమర్రి పట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్ స్టైల్స్ కరాటే అండ్ కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్–2025 పోటీల్లో సీసీసీ నస్పూర్‌కు చెందిన ఆర్.సిమ్రిత ప్రతిభ కనబరిచి బహుమతి సాధించింది. బ్లాక్‌బెల్ట్, బ్రౌన్ బెల్ట్ స్పారింగ్‌లో చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆమెను బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై యు.ఉపేందర్‌రావు అభినందించారు. మున్ముందు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ పోచంపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

‘42శాతం రిజర్వేషన్లు ఇస్తుందనే నమ్మకం లేదు’

పాతమంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తుందన్న నమ్మకం కలుగడంలేదని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేయకుండా 8 నెలల కాలాన్ని వృథా చేసిందని, మొక్కుబడిగా కమిటీలు వేస్తూ చివరకు కులగణన కూడా బయట పెట్టకుండా బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామంటే నమ్మేదెలా అన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు తమ స్వలాభం కోసం బీసీ రిజర్వేషన్ల అంశాన్ని వాడుకుంటున్నట్లు స్పష్టంగా అర్థమౌతుందన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

లక్సెట్టిపేట: ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్రాధ్యక్షుడు తాటికొండ రవి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా ప్రథమ మహాసభల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థులతో పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ నుంచి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదని, ఫీజు బకాయిలు ఇవ్వడం లేదని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయకపోతే ప్రజాభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తిరుపతి, నాయకులు అరుణ్‌కుమార్, చంద్రశేఖర్, మిట్టపల్లి తిరుపతి పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

శ్రీరాంపూర్: ఈ నెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ట్రస్మా ఆధ్వర్యంలో బుధవారం సీసీసీలోని ఎంఎం గార్డెన్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు అందించారు. నస్పూర్ ఎంఈవో పద్మజ మాట్లాడుతూ విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందన్నారు. అనంతరం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ 2026– 27లో రాష్ట్రంలో కొత్త విద్యా విధానం రాబోతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాని, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నాయకులు శ్యాంసుందర్ రెడ్డి, రజిని, రేగళ్ల ఉపేందర్, రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బొజ్జ గణపయ్యకు ప్రత్యేక పూజలు



దండేపల్లిలో బాలగణేష్ మండపం వద్ద కుంకుమ పూజలు



వేమనపల్లి: నైవేద్యం సమర్పిస్తున్న మహిళలు



జైపూర్: ప్రసాదాలతో మహిళలు



భీమారం: లక్ష్మీగణపతి హోమం

బెల్లంపల్లిరూరల్/భీమిని/మంచిర్యాలటౌన్/భీమారం/వేమనపల్లి/చెన్నూర్‌రూరల్/మంచిర్యాల అర్బన్/దండేపల్లి/జైపూర్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం గణనాథుడు ప్రత్యేక పూజలు అందుకున్నాడు. జైపూర్ మండల కేంద్రంలో గల భూనీల సమేతా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బొజ్జ గణపయ్యకు 101నైవేద్యాలతో, బెల్లంపల్లి మండలం చంద్రవెల్లిలోని శ్రీ అన్నపూర్ణ సహిత సోమేశ్వర స్వామి దేవాలయంలో 108రకాల నైవేద్యాలు, వేమనపల్లి మండలం అన్నపూర్ణ విశ్వేశ్వరాలయంలో 21రకాల నైవేద్యాలు అత్యంత భక్తి శ్రద్ధలతో సమర్పించారు. భీమారంలో సాయిరాం యూత్ గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. మంచిర్యాల నగరంలోని చింతపండు వాడ సిద్ధి వినాయకుడి మండపం వద్ద



జన్నారంలో భక్తుల పూజలు

మాస్టర్ మండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కర్రసాము ప్రదర్శన చేపట్టారు. ఎల్‌ఐసీ కాలనీలోని అంజనీ పుత్ర గణేష్ మండలి 25వ వార్షికోత్సవం సందర్భంగా వేద పండితులు ఫణిశర్మ ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హోమాన్ని కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. చెన్నూర్ మండలంలోని ఆస్నాదలో శివ సాయి గణేశ్ మండలి వద్ద, దండేపల్లి మండల కేంద్రంలోని బాలగణేష్ మండలి వద్ద మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు.



బెల్లంపల్లిరూరల్: నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు



కళాకారులతో మాస్టర్ మండ శ్రీనివాస్

సమాచారం

ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 8న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు. గ్రామలెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, మటర్ టెక్నాలజీస్, టీకీల్ ఇండ్రస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, ష్నైడర్ ఎలక్ట్రికల్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, ఆదర్శ ఆటోమొబైల్స్, వెమ్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 530ఖాళీలున్నాయని పేర్కొన్నారు. ఆయా కంపెనీల్లో ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్ కోపా, వెల్డర్, డ్రాఫ్ట్‌మన్ ట్రేడ్స్‌లో ఖాళీ లున్నాయని అర్హులైన అభ్యర్థులు సంబంధిత ధృవపత్రాలతో హాజరుకావాలన్నారు. పూర్తి వివరాలకు ఐటీఐలో సంప్రదించాలన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు ఆహ్వానం

మంచిర్యాలఅర్బన్: స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పాండురంగశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 6లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్

మంచిర్యాలటౌన్: తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హన్మంతరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 19 రకాల ఆటలకు గాను ఉత్సాహవంతులైన ప్రభుత్వ ఉద్యోగులు సెప్టెంబర్ 5వ తేదీలోపు వారి పేర్లను డీవైఎస్‌వో కార్యాలయంలో నమోదు చేసుకోవాలని, జిల్లాస్థాయి ఎంపిక పోటీలను 6వ తేదీన జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 99635 39234, 95150 92010 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బీసీ బిల్లు ఆమోదంపై హర్షం

- సీఎం, ఎంపీ, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం
- బాణాసంచా కాల్చి సంబురాలు



తాండూర్: కాంగ్రెస్ నాయకుల సంబురాలు

తాండూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తూ శాసన సభలో బిల్లు ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ తాండూర్ మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఎంపీ గడ్డం వంశీకృష్ణల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎంపీ గడ్డం వంశీకృష్ణ చూపిన చొరవతోనే వందేభారత్ రైలు కాగజ్‌నగర్ మంచిర్యాలలో హాల్టింగ్ కల్పించినందుకు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మహ్మద్ ఈసా, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్‌రావు, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్



వైద్యులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

జైపూర్: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ వైద్యులు, వైద్యసిబ్బందికి సూచించారు. మండలంలోని కుందారం ప్రభుత్వ ఆస్పత్రి, గంగిపల్లిలో పల్లెదావఖానను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రుల ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ఆస్పత్రిలో ల్యాబ్, మందుల స్టాక్ రూమ్‌లను పరిశీలించి అన్నిరకాల ముందులు అందుబాటులో ఉండేలా చూడాలని, ఆస్పత్రికి వచ్చే రోగులతో వైద్యులు, వైద్యసిబ్బంది స్నేహపూర్వకంగా ఉంటూ వైద్యం అందించాలన్నారు. రోగులను వారి బాగోగులు అడిగి తెలుసుకున్నానరు. అనంతరం జైపూర్‌లో కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. గంగిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడారు. సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చూడాలని చెప్పారు. ఎంపీడీవో సత్యనారాయణ, కస్తూర్బా గాంధీ ప్రత్యేకాధికారి ఫణిబాల, వైద్యులు ఉన్నారు.

స్పందించారు.. మరమ్మతు చేశారు

సాక్షి ఎఫెక్ట్..



కోతకు గురైన చోట మొరం పోసిన దృశ్యం

దండేపల్లి: మండలంలోని ద్వారక గోదావరి నదికి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన భారీ వరాల్లకు గోదావరి నది ఉప్పొంగి రోడ్డు కోతకు గురైంది. దీంతో భక్తులు నది వద్దకు వెళ్లేందుకు ఇబ్బందులు పడడంతో పాటు గణేశ్ నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తేలా ఉండటంతో ‘సాక్షి’లో ఈ నెల 2న ‘గణేశా.. జరపైలం’ అనే కథనం ప్రచురితం అయ్యింది. కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డు కోతకు గురైన చోట బుధవారం మొరం పోయించి తాత్కాలిక మరమ్మతు చేశారు. గోదావరి నదికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు లేకుండా చేశారు. కాగా నిమజ్జనానికి కూడా ఇబ్బందులు తొలగించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన ‘సాక్షి’కి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ రోడ్డుకు నిధులు మంజూరు

సాక్షి ఎఫెక్ట్..

నెన్నెల: మండలంలోని చిత్తాపూర్ నుంచి జెండావెంకటాపూర్‌కు వెళ్లే సీసీ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై సిమెంట్ పైపులు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో జెండావెంకటాపూర్, ఆదిల్‌పేట్, మందమర్రి, జైపూర్‌కు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తీరుపై ఈ నెల 2న ‘కోతకు గురైన రోడ్డు’ అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందించారు. వరద నష్టం నిధుల కింద రూ.లక్ష 90వేలు మంజూరు చేశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది కలగకుండా తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని చెప్పారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత కొత్త కల్వర్టు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చినట్లు గొల్లపల్లి మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్ తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

పాలఘోరీలలో అలజడి

- చెట్లు నరికిన ఆదివాసీలు
- కౌన్సెలింగ్ ఇచ్చిన అధికారులు



ఆదివాసీలతో మాట్లాడుతున్న సీఐ, అటవీ అధికారులు

జన్నారం: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్, జైనూర్ ప్రాంతాలకు చెందిన ఆదివాసీ గిరిజనులు జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి రేంజ్ కవ్వాల్ సెక్షన్‌లోని పాలఘోరీల ప్రాంతంలో గుడిసెలు వేసుకొని నెల రోజులుగా నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి చెట్లు నరికివేసి అలజడి సృష్టించారు. ఇందన్‌పల్లి రేంజ్ అధికారి శ్రీధరచారి సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. టేకు, నాన్ టేకు చెట్లు సుమారు 52చిన్నవి నరికివేసినట్లు ఎఫ్‌డీవో రామ్మోహన్ తెలిపారు. అడ్డుకున్న సిబ్బందిని తోసేసినట్లు, ప్రాంతం ఖాళీ చేయాలని తెలిపినా వినడం లేదని పేర్కొన్నారు. లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి ఆదివాసీ గిరిజనులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అడవిలో ఉంటూ చెట్లు నరికివేయడం చట్ట ప్రకారం నేరమని, శాంతియుతంగా, చట్ట పరిధిలో సమస్య పరిష్కారం చేసుకోవాలని సూచించారు. చెట్ల నరికివేతకు పాల్పడిన 40మందిపై కేసులు చేశారు. కానీ భూమి తమదేనని, భూమి మాకు దక్కే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని గిరిజనులు భీష్మించుకు కూర్చున్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



చెన్నూర్: ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ

చెన్నూర్: మున్సిపాలిటీలో గురువారం జరిగే గణేశ్ నిమజ్జనంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. స్థానిక పెద్ద చెరువు నిమజ్జన ఘాట్‌ను సీఐ దేవేందర్‌రావు, మున్సిపల్ కమిషనర్ మురళికృష్ణతో కలిసి సందర్శించారు. రూట్ మ్యాప్‌ను ఏర్పాటు చేయాలన్నారు. శోభాయాత్రను నిర్వాహకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించాలన్నారు. నిమజ్జన ఘాట్ వద్ద గజ ఈతగాళ్లు, ఫైర్‌మెన్లను ఏర్పాటు చేయాలన్నారు.

జన్నారం: మండలకేంద్రంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీలో వినాయక నిమజ్జనం ఏర్పాట్లను బుధవారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎస్సై అనూష, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, కార్యదర్శి రాహూల్ పరిశీలించారు.

నిమజ్జనం వద్ద శిబిరాలు ఏర్పాటు చేయాలి



డాక్టర్ అనిత

మంచిర్యాలటౌన్: జిల్లాలో నిర్వహించే నిమజ్జనం ఘాట్ల వద్ద వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి, వైద్య శిబిరాలు నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ అనిత అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లతో సమీక్షను గూగుల్ మీట్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ కృపాబాయి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, డీపీవో ప్రశాంతి, డిడిఏం భాగ్య, ప్రవళిక పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

లక్సెట్టిపేట: పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి ఛత్రునాయక్ బుధవారం పరిశీలించారు. స్థానిక బీట్ బజార్‌లోని శ్రీ రాజరాజేశ్వర్ ఫర్టిలైజర్ దుకాణంలోని పురుగు మందులు, రికార్డులను పరిశీలించారు. రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని నాణ్యమైన పురుగు మందులను అమ్మాలని సూచించారు. రశీదులు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ బుధవారం జీఎం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏరియాలోని కేకే ఓసీని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఐఎన్‌టీయూసీ ఫిట్ కార్యదర్శి సాంబయ్య, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి మల్లిఖార్జున్, నాయకులు ఆంజనేయులు తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యాలయ హెచ్‌వోడీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏరియా పరిస్థితిని తెలుసుకున్నారు. ఏరియా గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో జీఎం కార్యాలయ చాంబర్‌లో జీఎంను శాలువాలతో ఘనంగా సత్కరించారు.

పంట నష్టంపై సర్వే



తాండూర్: పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

చెన్నూర్‌రూరల్/కోటపల్లి/బెల్లంపల్లిరూరల్/భీమిని/వేమనపల్లి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సర్వే చేశారు. చెన్నూర్ మండలం కొమ్మెర, పొక్కూరు శివారులో నీటమునిగిన పంటల వివరాలను ఏఈవో సాగర్ నమోదు చేశారు. అన్నారం బ్యాక్ వాటర్‌తో జనగామ శివారులో మునిగిన పంటలను ఏవో సాయికృష్ణరెడ్డి, ఏఈవో రమ్య పరిశీలించారు. బెల్లంపల్లి మండలంలోని దుగ్నెపల్లి, రంగపేట, పెర్కపల్లి, బుధాకుర్దు, బుధాకలాన్, కన్నాల గ్రామాల్లోని ఏవో ఎస్.ప్రేమ్‌కుమార్ సర్వే చేపట్టారు. భీమిని, కన్నెపల్లి మండలాల్లోని తంగళ్లపల్లి, చిన్నతిమ్మపూర్, వెంకటపూర్, మాడవెల్లి, జజ్జరవెల్లి, చింతపూడి గ్రామాల పరిధిలో ఏవోలు యమునా దుర్గా, సాయిప్రశాంత్, ఏఈవోలు వినోద్, అఫ్రోజ్, కార్తీక్, విజయ్, సంతోష్, అలేఖ్య నష్టం వివరాలు సేకరించారు. వేమనపల్లి మండలంలో ప్రాణహిత బ్యాక్ వాటర్‌తో వేమనపల్లి, సుంపుటం, నీల్వాయి శివారులో దెబ్బతిన్న పంటలను ఏఓ వీరన్న పరిశీలించారు. ఏఈవోలు రుక్సార్ సుల్తానా, హెప్సీబాతో కలిసి నష్టం వివరాలు నమోదు చేశారు.

తాండూర్: భారీ వర్షాల వల్ల నష్టపోయిన వరి, పత్తి పంటలను మండల వ్యవసాయాధికారి సుష్మ పరిశీలించారు. మండలంలోని అచ్చలాపూర్, ద్వారకాపూర్, రాంపూర్, చంద్రపల్లి, మాదారం గ్రామాల్లో బుధవారం సర్వే నిర్వహించి నష్ట తీవ్రతను నమోదు చేసుకున్నారు. ఈ క్షేత్ర పరిశీలనలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు శంకర్, వెంకటేష్, ధనలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల బరిలో పొలిటికల్ బీసీ జేఏసీ

పాతమంచిర్యాల: స్థానిక సంస్థల ఎన్నికల బరిలో తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ ఉంటుందని తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ జిల్లా ఇన్‌చార్జి మహేశ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో సమావేశం నిర్వహించారు. బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా తీన్మార్ మల్లన్న సారథ్యంలో తెలంగాణ పొలిటికల్ బీసీ జేఏసీ ముందుకు వెళ్తుందన్నారు. నాయకులు పాకాల దినకర్, దాస్యపు దీపక్, రాజశేఖర్, శివతేజ, మహ్మద్ లతీఫ్ పాల్గొన్నారు.

‘ప్రజల ఇబ్బందులను పట్టించుకోని పాలకులు’

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రజలు పడుతున్న ఇబ్బందులను పాలకులు పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి విమర్శించారు. బెల్లంపల్లి పాత సింగరేణి జనరల్ మేనేజర్ కార్యాలయం చౌరస్తా వద్ద బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను, పోచమ్మ గడ్డ చౌరస్తా శివారు ప్రాంతం రహదారి పక్కన డంప్ చేస్తున్న చెత్త చెదారాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సీపీఎం బెల్లంపల్లి మండల కార్యదర్శి జి.అశోక్, జిల్లా కమిటీ సభ్యులు డి.రంజిత్ కుమార్, సీహెచ్ దేవదాసు, శ్రేణులు శ్రీకాంత్, లచ్చన్న, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

జాతీయస్థాయి పోటీల్లో చందన ప్రతిభ

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌కు చెందిన ఆడెపు చందన గత నెల 30, 31వ తేదీలలో నిర్వహించిన సౌత్ ఇండియా కరాటే పోటీల్లో ప్రతిభ కనబరచి బ్రాంజ్ మెడల్ సాధించినట్లు స్టేట్ జనరల్ సెక్రెటరీ మల్యాల రామస్వామి తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్: ఈ నెల 7న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సదస్సుకు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు హాజరుకావాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందం తెలిపారు. శ్రీరాంపూర్‌లోని సివిల్ కార్యాలయం వద్ద దీనికి సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు.

కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నర్సింగాపూర్‌లో బుధవారం స్థానిక రైతులకు కూరగాయలు, ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానవన శాఖా ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కూరగాయల్లో చీడపీడల సస్యరక్షణపై మంచిర్యాల డివిజన్ ఉద్యానవన అధికారి సహజ పలు సూచనలు చేస్తూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీల వివరాలను రైతులకు తెలిపారు. ఉద్యానవన శాస్త్రవేత్త స్రవంతి, ఏవో కృష్ణ, ఏఈఓలు శేఖర్, ప్రసన్న, రైతులు పాల్గొన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

లక్సెట్టిపేట: యూరియా కోసం రైతులు ఆందోళన చెందొద్దని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో హాజీపూర్, దండెపల్లి, లక్సెట్టిపేట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే హైదరాబాద్ నుంచి వీడియో కాల్‌లో మాట్లాడారు. ప్రిన్సిపల్ సెక్రెటరీతో మాట్లాడి త్వరలోనే యూరియాను తీసుకొస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఆర్జీపీఎస్ అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, ఏఎంసీ ప్రేంచంద్, పట్టణాధ్యక్షుడు ఆరీఫ్, మండలాధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

వాల్మీకీలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కాసిపేట: కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు వాల్మీకి బోయ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర వాల్మీకి బోయ ఎస్టీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొంది రమణ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని కాసిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో మెనిఫెస్టోలో పెట్టారని గుర్తుచేశారు.

ఎస్‌హెచ్‌వీఆర్‌పై శిక్షణ

దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌హెచ్‌వీఆర్ (స్వచ్ ఏవం హరిత విద్యాలయ రేటింగ్)పై మండల స్థాయిలో బుధవారం శిక్షణ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సెక్టోరియల్ అధికారి చౌదరి, సత్యనారాయణమూర్తి, విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. యూడైస్ కలిగిన అన్ని ప్రభుత్వ ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రేటింగ్ ఫాం ఎలా నింపాలో తెలియజేశారు. ఆరు కేటగిరీల్లో 125 మార్కులకు 90 శాతంకు పైగా వచ్చిన పాఠశాలలకు ఫైవ్‌స్టార్ రేటింగ్ ఉంటుందన్నారు. పీజీ హెచ్‌ఎంలు రాజేశ్వర్‌రావు, చిన నర్సయ్య, సుదర్శన్, రిసోర్స్ పర్సన్లు కృష్ణమూర్తి, లక్ష్మణచారి పాల్గొన్నారు.

జన్నారం: స్వచ్ఛ ఏవం హరిత్ విద్యాలయం రేటింగ్‌పై మండలంలోని అన్ని యజమాన్యాల పాఠశాలల, జూనియర్ కళాశాలల ప్రధానోపాధ్యాయులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం జన్నారం బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించా రు. మండల విద్యాధికారి విజయకుమార్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఎస్‌హెచ్‌వీఆర్ పోర్టల్‌లో మొక్కలు నాటి ఫొటోలు అప్‌లోడ్ చేయాలన్నారు.

కంటి శస్త్ర చికిత్సలు

పాతమంచిర్యాల: లయన్స్‌క్లబ్ మంచిర్యాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 30మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సను కరీంనగర్‌లోని రేకుర్తి ఐ హాస్పిటల్‌లో నిర్వహించినట్లు లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్టు కోఆర్డినేటర్ ఫర్ ఐ క్యాంప్స్ వి.మధుసూదన్ రెడ్డి తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల : 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : విజయ్ ప్రకాంత్ - 9440208447
చెన్నూర్ : తిరుపతి, ACO - 7997958206
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899